క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



రాములును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: పట్టణ పరిధిలోని డోలపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నేత అలజంగి రాములును ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం బారినపడిన రాము ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంటి దగ్గర ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనను ఆదివారం కలిసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సీనియర్ నేత పొట్నూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'చంద్ర'కు ఘననివాళి



రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో సీపీఐ నేత, కార్మికుల సంక్షేమ పోరాటయోధుడు చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపోలమ్మ 'సిరిమాను' గుర్తింపు



సిరిమాను చెట్టుకు పూజలు చేసి, కటింగ్ ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేటలో కొత్తపోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా చేపట్టే సిరిమానోత్సవానికి సంబంధించి, మల్లంపేట సమీపంలో సిరిమాను(చెట్టు)ను ఆదివారం గుర్తించారు. ఈ నెల 24వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

రాజాం: రాజాం–పాలకొండ రోడ్డులోని అప్సర థియేటర్ ఎదురుగా బాబానగర్ సత్యసాయి మందిరం సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఆదివారం ప్రారంభించారు. పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు దీనిని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అటువైపుగా వెళ్లే వారికి గ్లాసులతో మజ్జిగ పంపిణీ చేశారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



రాజాం: కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం తీస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రాజాం: పట్టణ పరిధిలోని వంజరాంపేట, గాయత్రి కాలనీల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ ఆదివారం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ అక్కడి పారిశుద్ధ్య పనులు పరిశీలించి, ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా కాలువల్లో మురుగు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సారథి, ఇందిరమ్మకాలనీ, శ్రీనివాసా థియేటర్ రోడ్డు ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నాగావళి నదికి కొత్త నీరు



నారాయణపురం ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్న వరదనీరు

సంతకవిటి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని రంగారాయపురం గ్రామం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్టకు కొత్తనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నదిలో పెరిగిన వరదనీటి ప్రవాహంతో చప్టాల మీదుగా నీరు దిగువ ప్రాంతాలకు వెళ్తోంది. దీంతో తమ వ్యవసాయానికి ఈ నీరు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన



రాజాం సిటీ: రాజయ్యపేటలో మా నమ్మకం నువ్వే జగన్ అని స్టిక్కర్లు చూపిస్తున్న మహిళలు



రాజాం: మారేడుబాకలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీత తదితరులు



రేగిడి: వన్నలిలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు



తెర్లాం: కూనాయవలసలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు



బాడంగి: కోడూరులో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గౌరి

బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. రాష్ట్ర పురోగతి, ప్రజాసంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయనతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



వంగర: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



బొబ్బిలిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ పార్వతి



మెంటాడ: జక్కువలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



రామభద్రపురం: కొత్తరేగలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణరావు

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు రమేష్

బాడంగి: మైనార్టీలు, దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 11వ తేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమంను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గర్భాపు రమేష్ కోరారు. ఇదే విషయమై స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన దేశవ్యాప్తంగా 140కి పైగా దాడులు జరిగాయని, వీటిల్లో 20 మందికి పైగా ఊచకోతకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులపై తీసుకునే చర్యలు కఠినంగా ఉంటే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. దళితులు, మైనార్టీలు, ఎస్టీలకు రక్షణగా మరికొన్ని బలమైన చట్టాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దీనిపై కేంద్రం ఆలోచించాలన్నారు. మోదీ పాలనా హయాంలోనే దళితులపై ఎక్కువగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారు ఎస్సీ, ఎస్టీల చట్టాలను పరిరక్షణకు కృషి చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నవధాన్యాల సాగు, తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ పొలంలో ఏదైనా పంటలు వేసే ముందు నవధాన్యాలు సాగు చేసుకుంటే నేల సారవంతమవుతుందని, తద్వారా పంటలు బాగా పండుతాయన్నారు. అనంతరం 11 రకాల విత్తనాలతో కిట్లు తయారు చేసి, పంపిణీ చేశారు. వీటిని ప్రతిఒక్కరూ పొలంలో చల్లి, నేలతల్లి బాగును కోరుకోవాలన్నారు. నేలసారం బాగుంటే పంటల దిగుబడి బాగుంటుందన్నారు.



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కిమ్మి-రుషింగి వంతెన పనులను పూర్తి చేయండి

వంగర: కిమ్మి–రుషింగ్ వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేషముఖర్జి సూచించారు. అక్కడి నాగావళి నదిపై నిర్మిస్తున్న వంతెనను ఆదివారం పరిశీలించిన ఆయన నిర్మాణం పూర్తి కావచ్చిందని, పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యలకల శ్రీనివాసరావు, యలకల వాసునాయుడు, బొత్స ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వంతెన పనుల పరిశీలనలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

కోళ్లఫారాలను తొలగించాలి



అచ్చియ్యపేట గ్రామం ఆనుకుని ఉన్న కోళ్లఫారం షెడ్లు

బాడంగి: మండలంలోని అచ్చియ్యపేట గ్రామం ఆనుకుని, ఉన్న కోళ్లఫారాలను తొలగించాలని గ్రామపెద్దలు లచ్చుపతుల సత్యం, శ్రీరాము, యామల కృష్ణమూర్తి, మరడ రామినాయుడు కోరుతున్నారు. ఇదే విషయమై వీరంతా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడి కోళ్లఫారాలతో గ్రామస్తులు తరచూ అనారోగ్యం బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోళ్ల వ్యర్థాలను కూడా గ్రామం దగ్గరలోనే పడవేస్తున్నారని దీంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఒక్కోసారి అక్కడ పడేసిన కుళ్లిపోయిన కోళ్లను గ్రామంలోని కుక్కలు వీధుల్లోకి తెచ్చి తింటున్నాయని దీంతో దుర్గంధం వెలువడుతోందని, ముక్కులు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇదే సమస్య పరిష్కారానికి గతంలో చాలాసార్లు అధికారులకు ఫిర్యాదులు చేశామని, స్పందించిన కలెక్టర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్‌ను గ్రామం పంపించి, విచారణ చేయించారని పేర్కొన్నారు. తదుపరి చర్యల కోసం పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినా చర్యలు శూన్యమన్నారు. ఉన్నతాధికారులు మరోసారి స్పందించి, చర్యలకు ఆదేశించాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కస్పావీధిలో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న శ్రీనివాసరావు

రాజాం: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని కస్పా వీధిలో ఆదివారం పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అన్ని రంగాల్లో అన్ని వర్గాల వారికి సమాన ప్రాధాన్యం అందిస్తోన్న ఏకైన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజాం పట్టణ జేసీఎస్ కన్వీనర్ సత్యనారాయణ, తోట తిరుమలరావు, నీలకంఠం, అయ్యప్ప, శేఖర్, చంద్రరావు, ప్రసాద్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బుచ్చింపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాజాం: పట్టణ పరిధిలో బుచ్చింపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి పదో వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడిగా కేశవ

బొబ్బిలి: ఉమ్మడి విజయనగరం జిల్లా హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడిగా చెలికాని కేశవ ఎన్నికైనట్లు ఆర్.ఎస్.ఎస్ జిల్లా సంఘ్ చాలక్ పెంట స్వామినాయుడు ఆదివారం తెలిపారు. వేదిక ఉపాధ్యక్షులుగా ఎం.అనిల్, పి.రవి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

స్నేహితుడికి సాయం



శ్రీనివాసరావుకు నగదు, వస్త్రాలు అందజేస్తున్న మిత్రులు

పాలకొండ రూరల్: చిన్నప్పుడు తమతో కలిసి చదువుకున్న మిత్రుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకుని తోటి స్నేహితులు అండగా నిలిచారు. పట్టణానికి చెందిన ఒప్పంగి శ్రీనివాసరావుది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. పైగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నాడు. ఈ క్రమంలో ఆయన కుమార్తెకు వివాహం కుదిరింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న స్నేహితుని పరిస్థితి తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు దిలీప్‌కుమార్, శిల్లా మల్లేశ్వరరావు, తలే సీతారాము తదితరులు ఆదివారం మిత్రుడు శ్రీనివాసరావుని కలిసి ధైర్యం చెప్పారు. ఆయన కుమార్తె వివాహం కోసం రూ.20 వేల నగదు, పట్టువస్త్రాలు అందించారు. మిగిలిన స్నేహితులతో కలిసి మరింత సహకారం అందిస్తామన్నారు.

హెచ్‌సీ దాతృత్వం



బాధితులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

కొమరాడ: పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మండలంలోని సర్వపాడు గ్రామంలో ఇంటిగోడ కూలిపోయి ప్రాణాలు కోల్పోయిన కేంద్రీక శంకరరావు, జీలకర్ర మాణిక్యమ్మ కుటుంబ సభ్యులకు, ఇదే ప్రమాదంలో గాయపడిన మెల్లక రాజు, జీలకర్ర హరికృష్ణ, మండంగి రవిలకు రూ.5వేలు చొప్పున నగదుతో పాటు 78 కిలోల బియ్యం అందజేశారు. సర్పంచ్ హిమరిక గంగాధర్ చేతులమీదుగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

'ధర్మశాస్త్రం-కృప' పుస్తకం ఆవిష్కరణ

తెర్లాం: ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని, మండలంలోని కూనాయవలస క్రీస్తు ప్రార్థనా మందిరంలో ధర్మశాస్త్రం–కృప అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత, ఇమ్మానుయేల్ బైబిల్ కళాశాల ప్రిన్సిపాల్, పాస్టర్ సంపత్‌కుమార్ భాష్యం మాట్లాడుతూ ధర్మశాస్త్రం–కృపకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పుస్తకంలో వివరించడం జరిగిందని, ప్రతీ క్రైస్తవ విశ్వాసి తప్పనిసరిగా ఈ పుస్తకం చదవాలని కోరారు. ధర్మశాస్త్రం మోషే ద్వారా అనుగ్రహించబడితే, కృప, సత్యంను ఏసు క్రీస్తు ద్వారా అనుగ్రహించబడిందన్నారు. ఈ పుస్తకం రాయడానికి, అచ్చు వేయడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టరమ్మ వినోలియా భాష్యం, పాస్టర్ ప్రతాప్‌కుమార్, పాస్టర్ ఎఫ్రాయిం తదితరులు పాల్గొన్నారు.



ధర్మశాస్త్రం–కృప పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

అభివృద్ధి పనులపై ఎంపీ ఆరా

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆరాతీశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఎంపీడీఓ కార్యాలయ ఆధునీకరణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాల మేర చేపట్టాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహణ ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పలుచోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులు ఎంతమేర పూర్తయ్యాయో అడిగి, వాటి పూర్తికి చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై ఆరాతీస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

బొబ్బిలి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామదేవత పండగ జరుపుకోవాలని సీఐ ఎం.నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో ఈ నెల 24వ తేదీ నుంచి గ్రామదేవత పండగ జరగనున్న నేపథ్యంలో ఆదివారం గ్రామపెద్దలతో సమావేశమైన ఆయన పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామపెద్దలకు సూచించారు. పండగకు బంధుమిత్రులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున జనం హాజరుకానున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో గ్రామపెద్దలు గొర్లె లక్ష్మణ, గొట్టాపు స్వామినాయుడు, గేదెల జనార్దనరావు, గుణుపూరు శ్రీనివాసరావు, చుక్క సత్తిబాబు పాల్గొన్నారు.



గ్రామపెద్దలతో చర్చిస్తున్న సీఐ నాగేశ్వరరావు

ఘనంగా ఈస్టర్ వేడుకలు



తెర్లాం: కూనాయవలసలో 'క్రీస్తు నేడు లేచెను' అనే సువార్తను ప్రకటిస్తున్న క్రీస్తు విశ్వాసులు



బాడంగి: రామచంద్రాపురంలో హ్యాపీ బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థన



బొబ్బిలి: ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫాదర్‌లు, పాస్టర్లు, మతవిశ్వాసకులు ఏసుక్రీస్తు పునరుత్థానం(మరణం జయించి, తిరిగి రావడం) గూర్చి వివరించారు. సమస్త మానవాళి పాప పరిహారార్థమై గుడ్‌ఫ్రైడే నాడు శిలువ మరణం పొందిన ఏసుప్రభువు మూడోరోజు సమాధి నుంచి సజీవుడై లేచి వచ్చి, నిజమైన దేవుడిగా కీర్తింపబడ్డారని తెలిపారు. ఎదుట వారు చేసిన తప్పులను క్షమించాలని, పొరుగువారిని ప్రేమించాలని, ప్రతిఒక్కరూ ఒకరిపై మరొకరు జాలి, దయ, కరుణ, ప్రేమ కనబరచాలన్న జీసస్ బోధనలను ఆచరించి, ప్రపంచశాంతికి తోడ్పడాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్